
సాక్షి ఒడిశా

శనివారం । 3 । జూన్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.6,57,458లు, బంగారం 19.2 గ్రాములు, వెండి 60.5 గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



వేర్వేరు ప్రమాదాల్లో ఆరుగురి మృతి

● సత్తిగూడ జలశాయంలో పడవ బోల్తా

- 8లో



మారుమూల ప్రాంతాలకు మరిన్ని సేవలు

- 8లో

న్యూస్‌రీల్

అగ్నిగంగమ్మ ఆలయంలో అన్నదానం



అన్నదానంలో పాల్గొన్న ఎమ్మెల్యే రఘురాం పొడాల్, కమిటీ సభ్యులు

కొరాపుట్: అగ్నిగంగమ్మ ఆలయంలో భారీ అన్నదానం జరిగింది. కొరాపుట్ జిల్లా సిమిలిగుడ పట్టణంలో జాతీయ రహదారిపై కొలువుదీరిన ఆలయంలో మే 7నుంచి 17వరకు ఘనంగా సంబరాలు కొనసాగాయి. ఈ నేపథ్యంలో దేవాలయం సమీపంలో శుక్రవారం అన్నదానం చేపట్టారు. పరిసర గ్రామాల నుంచి సుమారు 5వేల మంది భక్తులు పాల్గొన్నారని నిర్వాహకులు తెలిపారు. కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం పొడాల్, ఈశ్వర్ అల్లాడ, పూజా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అత్యవసర సేవలు బంద్



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపడుతున్న మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం

పర్లాకిమిడి: గజపతి జిల్లా మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం నిరవధిక సెలవు ఆందోళన రెండో రోజు కొనసాగింది. శుక్రవారం ఉదయం నుంచి సిబ్బంది కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. రాష్ట్రప్రభుత్వం ఇప్పటి వరకు ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని, సాయంత్రం భువనేశ్వర్‌లో గ్రేడ్‌పే పెంపు విషయంలో సమావేశం జరుగనున్నదని కలెక్టర్ కార్యాలయం స్టెనో బలదేవ్ రథ్ తెలిపారు. మరోవైపు ఉద్యోగుల ఆందోళన నేపథ్యంలో కలెక్టరేట్, రెవెన్యూ, రోడ్లు–భవనాల శాఖ, ఉపాధి కార్యాలయం, సబ్ కలెక్టరేట్, తహసీల్దార్ కార్యాలయాల్లో అత్యవసర సేవలు నిలిచిపోయాయి.

252లీటర్ల విదేశీ మద్యం స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆటో

పర్లాకిమిడి: ఆటోలో అక్రమంగా తరలిస్తున్న 252లీటర్ల విదేశీ మద్యాన్ని పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. గురండి పోలీస్ స్టేషన్ పరిధి తాటిపట్టి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ బొంగు రంగారావు పర్లాకిమిడి నుంచి రవాణా చేస్తుండగా ఫారెస్ట్ గేటు వద్ద పట్టుకున్నారు. మద్యం, ఆటోను సీజ్ చేశారు. దీనిపై కేసు నమోదు చేయడంతో పాటు నిందితుడిని అరెస్ట్ చేసి, కోర్టులో హాజరు పరిచారు.

భక్తులకు సులభ దర్శనం

● భద్రతా వ్యవస్థపై ఐజీ సమీక్ష


భువనేశ్వర్: ఈనెల 4న పూరీ జగన్నాథాలయంలో జరగనున్న దేవస్నాన పూర్ణిమకు సంబంధించి ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయి. దీనిపై జిల్లా ఇన్‌స్పెక్టర్ జనరల్(సెంట్రల్ రీజియన్), ఆశిష్‌కుమార్ సింగ్, జిల్లా ఎస్పీ శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఐపీఎస్ బలగాలు, అధికారులకు దేవస్నాన యాత్రలో శాంతి భద్రతల పరిరక్షణలో భక్తులు, యాత్రికులకు సులభ దర్శన సౌకర్యాల ఏర్పాటుకు సంబంధించి వివరణాత్మక కార్యాచరణ తెలియజేశారు. పూర్తిగా భక్తుల ఆధారిత ఏర్పాట్లు సిద్ధం చేయడంతో పాటు వీటిని వాస్తవ కార్యాచరణలో అమలు చేయడం పట్ల బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. 60 ప్లటూన్ల బలగాలు రంగంలో ప్రత్యక్షంగా పాల్గొంటాయని వెల్లడించారు. 550మంది హోంగార్డులు, 300మంది సబ్ ఇన్‌స్పెక్టర్లు, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టరు ర్యాంక్ అధికారులు, 100మంది పర్యవేక్షక అధికారులు, ముగ్గురు కమాండెంట్లు పోలీసు ఏర్పాట్లను సక్రమంగా అమలు చేసేందుకు నియమించబడినట్లు వివరించారు.



సమీక్ష నిర్వహిస్తున్న ఐజీ ఆశిష్‌కుమార్ సింగ్

● పట్టాలపై..

మృత్యుఘోష




ఊహించని ప్రమాదం ప్రయాణికుల ఉసురు తీసింది. పట్టాలపై పరుగులు తీయాల్సిన రైలు.. ఆగి ఉన్న గూడ్స్‌ను ఢీకొనడంతో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. దీని నుంచి తేరుకొనే లోపే ఘటనకు గురైన రైలునే ఎదురుగా వస్తున్న మరో ట్రైను బలంగా ఢీకొంది. పదుల సంఖ్యలో మృతులు, క్షతగాత్రుల హాహాకారాలతో సాయం సంధ్య వేళ.. ప్రమాద స్థలం భీతావహంగా మారింది. బాధితులు పశ్చిమబెంగాల్, ఒడిశా, ఆంధ్ర ప్రదేశ్, తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన వారిగా భావిస్తున్నారు. - సాక్షి నెట్‌వర్క్

ప్రమాదం జరిగిన తీరిదీ..

- హౌరా నుంచి చెన్నై(షాలీమార్) వెళ్లాల్సిన కోరమండల్ ఎక్స్‌ప్రెస్(12841) శుక్రవారం మధ్యాహ్నం 3.20గంటలకు బయల్దేరింది. సాయంత్రం 6.30గంటలకు బాలాసోర్ రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. అక్కడి నుంచి భద్రక్‌కు 7.38గంటలకు చేరుకోవాల్సి ఉంది. అయితే బాలాసోర్ నుంచి 29కిలోమీటర్ల దూరంలోని బహనాగా వద్ద పక్కకు నిలిపి ఉన్న గూడ్స్ రైలును దాదాపు 7.20 గంటలకు బలంగా ఢీకొంది.
- ఈ ఘటనలో రైలు 12బోగీలు చెల్లాచెదురుగా ఎగిరి పడ్డాయి. బాధితులంతా హాహాకారాలు చేస్తూ ప్రాణాలు దక్కించుకోవాలనే ప్రయాసలో చుట్టుపక్కలకు పరుగులు తీశారు. మరికొందరు బోగీల్లో ఇరుక్కున్న వారిని బయటకు తీసేందుకు సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు.
- బెంగలూర్–హౌరా ఎస్ఎంవీటీ(12864) ఎక్స్‌ప్రెస్ రైలు గురువారం ఉదయం 10.35 గంటలకు బెంగలూర్ రైల్వేస్టేషన్‌లో బయల్దేరింది. షెడ్యూల్ ప్రకారం శుక్రవారం మధ్యాహ్నం 3.48 గంటలకు బాలాసోర్ చేరుకోవాల్సి ఉంది. దాదాపు 3గంటలు ఆలస్యంగా ప్రయాణించడంతో భద్రక్‌కు 6.30 గంటలకు చేరుకుంది. అయితే సాంకేతిక సమాచారంలోపంతో బహనాగా వద్ద అప్పటికే బోల్తా పడి ఉన్న కోరమండల్ ఎక్స్‌ప్రెస్‌ను రాత్రి 7.36 గంటలకు ఢీకొంది. రైలు 4బోగీలు బోల్తా పడ్డాయి.

- గూడ్స్ రైలును ఢీకొన్న హౌరా–చెన్నై కోరమండల్ ఎక్స్‌ప్రెస్
- బహనాగా రైల్వేస్టేషన్ పట్టాలపై బోల్తాపడిన 12 బోగీలు
- సహాయక చర్యలు కొనసాగుతుండగానే మరో ప్రమాదం
- ఎదురుగా వస్తూ అదే రైలును ఢీకొన్న యశ్వంతపూర్–హౌరా ఎక్స్‌ప్రెస్
- 50మందికి పైగా మృత్యువాత, దాదాపు 350మందికి తీవ్రగాయాలు
- సహాయక చర్యలకు సీఎం నవీన్ ఆదేశం
- సంతాపం వ్యక్తం చేసిన రాష్ట్రపతి, ప్రధాని





భువనేశ్వర్: తూర్పుకోస్తా రైల్వే బాలాసోర్–బహనాగా బజార్ రైల్వేస్టేషన్ సమీపంలో శుక్రవారం ఘోర రైలు ప్రమాదం చోటు చేసుకుంది. హౌరా నుంచి చెన్నై వెళ్తున్న కోరమండల్(12841) ఎక్స్‌ప్రెస్ గూడ్స్ రైలును ఢీకొంది. ఘటనలో 12 బోగీలు చెల్లాచెదురుగా పడిపోయాయి. బాధితులంతా హాహాకారాలు చేస్తూ పరుగులు తీస్తుండగా.. అదే సమయంలో ఎదురుగా వస్తున్న బెంగలూర్–హౌరా ఎస్ఎంవీటీ(12864) ఎక్స్‌ప్రెస్ రైలు కోరమండల్‌ను ఢీకొట్టింది. ఈ రెండు ప్రమాదాల్లో దాదాపు 350మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. దాదాపు 50మందికి పైగా మృతిచెందినట్లు రైల్వే వర్గాల సమాచారం. వీరిలో పలువురు క్షతగాత్రులను సారో కమ్యూనిటీ హెల్త్‌సెంటర్, గోపాల్‌పూర్ కమ్యూనిటీ హెల్త్‌సెంటర్, ఖొంటపడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. 20మంది ఇంటర్న్, 24మంది ఇతర వైద్యులు బాలాసోర్ మెడికల్ కళాశాల, పరిసర ప్రాంతాల్లో ఆస్పత్రులు, బాలాసోర్ జిల్లా ప్రధాన ఆస్పత్రి నుంచి వైద్య, చికిత్స బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. బాలాసోర్ మెడికల్ కళాశాలలో 10మంది ప్రయాణికులకు చికిత్స చేస్తున్నారు. బాలాసోర్, సమీప పట్టణాల నుంచి 50కి పైగా అంబులెన్స్‌లు ప్రమాద స్థలానికి చేరుకున్నాయి. జాతీయ విపత్తు స్పందన దళం ఘటనా స్థలానికి చేరుకున్నాయి. ప్రమాదం నేపథ్యంలో సత్వర సమాచారం అందజేసేందుకు ఈస్టుకోస్టు రైల్వే పరిధిలో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేశారు.

ప్రమాద స్థలానికి నేడు సీఎం

కోరమండల్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాద స్థలంలో స్థితిగతులను సమీక్షించేందుకు ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ శనివారం ఉదయం బాలాసోర్ జిల్లాలోని బహనాగా ప్రాంతానికి వెళ్లనున్నారు. ఈ ప్రమాదం అత్యంత బాధాకరమని ఆయన విచారం వ్యక్తం చేశారు. సహాయక చర్యలు పర్యవేక్షించేందుకు స్థానిక స్పెషల్ రిలీఫ్ కమిషనర్ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్‌ను సందర్శించిన సందర్భంగా ఆయన ఈ విషయం తెలియజేశారు.

ప్రధాని మోదీ సంతాపం

రైలు ప్రమాదంలో మృతి చెందిన వారికి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సంతాపం తెలిపారు. మృతుల కుటుంబాలకు సానుభూతి ప్రకటించారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్‌తో మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు. బాధితులకు సాధ్యమైన సహాయం అందించబడుతుందని ప్రకటించారు.

మృతులకు పరిహారం..

రైల్వేశాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్ రైలు ప్రమాదంలో బాధితులకు పరిహారం ప్రకటించారు. మృతులకు రూ.10 లక్షలు, తీవ్రంగా గాయపడిన బాధితులకు రూ.2 లక్షలు, స్వల్పంగా గాయపడిన వారికి రూ.50వేలు పరిహారంగా ప్రకటించారు.

కంట్రోల్ రూమ్‌లు..

కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ దుర్ఘటనలో అనేక కంపార్ట్‌మెంట్లు పట్టాలు తప్పి పల్టీ కొట్టాయి. కనీసం 5 కంపార్ట్‌మెంట్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ కంపార్ట్‌మెంట్లలో ప్రయాణిస్తున్న సుమారు 350మందికి పైగా ప్రయాణికులు ప్రభావితమయ్యారు. బాధితుల బంధువర్గాలకు తాజా సమాచారం అందజేయానికి సత్వర సహాయక, పునరుద్ధరణ కార్యకలాపాల కోసం ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. బాలాసోర్‌లో ఎమర్జెన్సీ కంట్రోల్ రూమ్, స్పెషల్ రిలీఫ్ కమిషనర్ కార్యాలయంలో మరో కంట్రోల్ రూమ్‌ను ప్రభుత్వం ప్రారంభించింది. ప్రయాణికుల సమాచారం కోసం ప్రజలు బాలాసోర్ కంట్రోల్ రూమ్‌లో 67822 62286 లేదా స్పెషల్ రిలీఫ్ కమిషనర్ కార్యాలయంలో 0674-2534177 నంబర్‌ను సంప్రదించవచ్చు.

టోల్ ఫ్రీ ఏర్పాటు

విజయనగరం టౌన్: ఒడిశాలో జరిగిన ఘోర రైలు ప్రమాదం నేపథ్యంలో విజయనగరం రైల్వే స్టేషన్‌లో బాధితుల సమాచారం తెలుసుకునేందుకు టోల్ ఫ్రీ నంబర్లను రైల్వేశాఖ ఏర్పాటు చేసింది. విజయనగరంలో 08922-221202, 221206 నంబర్లను ప్రయాణికులకు అందుబాటులో ఉంచింది. శ్రీకాకుళంలో 08942-286213, 286245 నంబర్ల ద్వారా ఫోన్ చేసి సమాచారం తెలుసుకోవచ్చని రైల్వే అధికారులు స్పష్టం చేశారు. కోరమండల్ రైలు బరంపురం తరువాత నేరుగా విశాఖలో ఆగుతుంది.

హెల్ప్‌డెస్క్ నంబర్లు

కాశీబుగ్గ: బాలాసోర్‌లో జరిగిన రైలు ప్రమాదంలో బాధితుల కుటుంబ సభ్యుల కోసం స్టేషన్ల వారీగా హెల్ప్‌డెస్క్ లను ఏర్పాటు చేశారు.

భద్రక్	84558 89900
జైపూర్	
కెంజహార్‌రోడ్డు	84558 89906
కటక్	84558 89917
భువనేశ్వర్	84558 89922
ఖుర్దా రోడ్	63701 08046
బరంపూర్	89173 887241
బాల్‌గోన్	99377 32169
పలాస	89788 81006
హౌరా	033263 82217
ఖరగ్‌పూర్	8972073925, 93323 92339
బాలాసోర్	8249591559, 79784 18322
షాలీమార్	99033 70746
శ్రీకాకుళం	08942286213, 45



దీనివల్ల శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు చెందిన ప్రయాణికులు ఉండకపోవచ్చని రైల్వే అధికారులు భావిస్తున్నారు.

సహాయక చర్యలు ముమ్మరం



భువనేశ్వర్: కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ దుర్ఘటన నేపథ్యంలో సహాయక చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ముగ్గురు సీనియర్ అధికారులను ఆదేశించారు. వీరిలో సుధాంశు షడంగి(డైరెక్టర్ జనరల్ ఫైర్ సర్వీసెస్), హేమంత్ శర్మ(పరిశ్రమల శాఖ కార్యదర్శి), బల్వంత్ సింగ్(ఒడిశా మైనింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్) ఉన్నారు. రైలు ప్రమాదం జరిగిన బాలాసోర్‌లోని బహనాగా ఘటనా స్థలం సందర్శనకు వెళ్లాలని స్పెషల్ రిలీఫ్ కమిషనర్ సత్యవ్రత సాహును రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి ప్రమీలా మల్లిక్ ఆదేశించారు. బాలాసోర్‌లోని ఒడిశా డిజాస్టర్ రెస్పాన్స్ యాక్షన్ ఫోర్స్ టీమ్ తక్షణ గాలింపు, సహాయక చర్యల కోసం ఘటనా స్థలానిని చేరుకుంది. స్థానిక కలెక్టర్ అన్ని ఏర్పాట్లు ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారు. రాష్ట్ర స్థాయి నుంచి అదనపు సహాయం అవసరమైతే స్పెషల్ రిలీఫ్ కమిషనర్‌కు తెలియజేయాలని ఆదేశించారు. బాలాసోర్, కటక్‌లోని వైద్య కళాశాలలు, మూడు జిల్లాల్లోని ఆసుపత్రులు గాయపడిన ప్రయాణికులను ఆదుకునేందుకు పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉంచినట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌కుమార్ జెనా తెలిపారు. 3 యూనిట్ల నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్, 4 యూనిట్ల ఒడిశా డిజాస్టర్ రెస్పాన్స్ యాక్షన్ ఫోర్స్, అనేక ఫైర్ సర్వీసెస్ యూనిట్లు, 50కి పైగా అంబులెన్సులు, గ్యాస్ లైట్లు సమీకరించారు. వైద్యులను అప్రమత్తం చేసినట్లు చీఫ్ సెక్రటరీ వివరించారు.

కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షణ

రాయగడ : బహనగ వద్ద శుక్రవారం జరిగిన రైలు ప్రమాద ఘటనకు సంబంధించి ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఎస్ఆర్‌సీ కంట్రోల్ రూం నుంచి పరిస్థితిని సమీక్షించేందుకు బయలుదేరివెళ్లారు. అంతకుముందు ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రైలు ప్రమాదం దురదృష్టకమైన సంఘటనగా పేర్కొన్నారు.

ప్రమాద దృశ్యాలు

బహనాగా రైల్వేస్టేషన్ వద్ద ప్రమాద స్థలంలో భీతావహ దృశ్యాలు, సహాయక చర్యల్లో రైల్వే సిబ్బంది, స్థానికులు











క్లుప్తంగా

ఆదిత్యాలయానికి ఫైర్‌సేఫ్టీ పరికరాల వితరణ



ఫైర్ సేఫ్టీ పరికరాలతో దాత, ఈవో, ప్రధానార్చకులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో అన్నదాన విభాగంలో వినియోగించేందుకు వీలుగా రూ.25 వేల విలువైన ఫైర్ అండ్ సేఫ్టీ పరికరాలను బి.అనంతరావు అనే భక్తుడు వితరణగా అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, సీనియర్ అసిస్టెంట్ జి.ఎ.వి.ఎల్.ఎన్ కృష్ణమాచార్యులు, నేతేటి హరిప్రసాద్ శర్మ పాల్గొన్నారు.

108 వాహన సిబ్బంది ఔదార్యం



ఆస్పత్రికి సిబ్బందికి వస్తువులు అందిస్తున్న 108 సిబ్బంది

కంచిలి: కంచిలి మండల 108 అంబులెన్స్ సిబ్బంది విధి నిర్వహణలో ఓ వ్యక్తి ప్రాణాలు కాపాడటంతో పాటు అతని విలువైన వస్తువులను నిజాయితీగా ఆస్పత్రి సిబ్బందికి అందించారు. పలాస మండలం మొగిలికొత్తూరుకు చెందిన కొమ్మరి లోకేష్ అనే తాపీమేస్త్రీ పలాస నుంచి ఇచ్ఛాపురం మండలం సీమూరు గ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా జక్కర గ్రామ కూడలి వద్ద గురువారం రాత్రి 11.30 గంటల సమయంలో 'సిమొకోసియస్ స్టేజ్' అనే వ్యాధి కారణంగా అపస్మార స్థితికి చేరుకున్నాడు. సమాచారం అందిన వెంటనే 108 అంబులెన్స్ సిబ్బంది తిరుపతిరావు, ఎస్.రామారావు ఘటనా స్థలానికి చేరుకొని బాధితుడికి సపర్యలు చేసి సోంపేట సామాజిక ఆసుపత్రిలో చేర్పించారు. బాధితునికి చెందిన రూ.10,330 నగదు, మొబైల్‌ఫోన్, బైక్ తాళాలను ఆస్పత్రి సిబ్బందికి అందజేశారు.

ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈగా జాన్ సుధాకర్



జాన్ సుధాకర్‌ను మర్యాదపూరకంగా కలిసిన ఈఈ సత్యనారాయణ

శ్రీకాకుళం: ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈగా కె.జాన్ సుధాకర్ శుక్రవారం విధుల్లో చేరారు. ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీల్లో భాగంగా శ్రీకాకుళం ఆర్‌అండ్‌బీ ఎస్‌గా పనిచేసిన కె.కాంతిమతి విశాఖపట్నానికి బదిలీపై వెళ్లారు. విశాఖలో పనిచేస్తున్న కె.జాన్ సుధాకర్ బదిలీపై శ్రీకాకుళం వచ్చారు. జాన్ సుధాకర్‌ను ఈఈ పి.సత్యనారాయణ, ఎస్.రవినాయక్ సిబ్బంది కలిసి అభినందనలు తెలియజేశారు.

14న జిల్లాస్థాయి పోటీలు

శ్రీకాకుళం కల్చరల్: జూన్ 14న ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా పాఠశాల, కళాశాలల్లో జేఆర్‌సీ, వైఆర్‌సీ విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నట్లు రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'స్వచ్ఛంద రక్తదానం- ఆవశ్యకత' అనే అంశంపై ఈ నెల 10లోగా ఆయా స్కూళ్లు, కళాశాలలో పోటీలు నిర్వహించి ఎంట్రీలను జిల్లా స్థాయి కమిటీకి పంపించాలని కోరారు. వారిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ఎంపిక చేస్తామని తెలిపారు. 14న బాపూజీ కళామందిర్‌లో సర్టిఫికెట్లు అందజేస్తామని చెప్పారు. అదే విధంగా, 50 పర్యాయాలకు మించి రక్తదానం చేసిన వారికి సత్కారం చేస్తామని పేర్కొన్నారు.

4న సత్యసాయి సేవాసమితి జిల్లా సమావేశం



లింగరాజు
సత్యసేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు

హిరమండలం: పాతపట్నంలో ఈ నెల 4న సత్యసాయి సేవా సమితి జిల్లాస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు వై.లింగరాజు మాస్టర్ తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రేమ సాయి వృద్ధాశ్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు జరిగే సమావేశానికి జిల్లాలోని అన్ని సత్యసేవా సమితుల కన్వీనర్లు, భజన మండలి కన్వీనర్లు, జోనల్ కన్వీనర్లు, జిల్లా పదాధిపతులు, కోఆర్డినేటర్లు, క్రియాశీలక సభ్యులు విధిగా హాజరుకావాలన్నారు. ఆధ్యాత్మిక, విద్యా సేవ, యువజన విభాగాల సేవలతో పాటు ఆగస్టులో నిర్వహించనున్న 20వ పర్తి యాత్రపై చర్చిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆశ్రమ కోఆర్డినేటర్ ఎస్.సాయిబాబా, అభివృద్ధి కమిటీ సభ్యులు జ్యోషు గోవింద శర్మ, చంటి మాస్టర్ పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఆరుగురి మృతి

- సత్తిగూడ జలాశయంలో పడవ బోల్తా
- గౌడిగూడలో కుప్పకూలిన ఎయిర్‌స్ట్రిప్ ప్రహరీ

మల్కన్‌గిరి: జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో గురువారం సాయంత్రం చోటు చేసుకున్న ప్రమాదాల్లో నలుగురు వ్యక్తులు మృతిచెందారు. పలువురు గాయాలపాలై, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వివరాల్లోకి వెళ్తే... మల్కన్‌గిరి సమితి భీమరాగ్ని గ్రామానికి చెందిన తులసీ మాఢి(35), రాజేష్ మాఢి(14), గోవింద సర్కార్ సత్తిగూడ జలాశయంలో చేపలు వేట్టేందుకు నాటు పడవలో వెళ్లారు. వల విసిరిన సమయంలో అకస్మాతుగా గాలివాన రావడంతో పడవ అదుపు తప్పి, బోల్తాపడింది. దీంతో తులసీ, అతని కుమారుడు రాజేష్ గల్లంతయ్యారు. గ్రామస్తులకు విషయం తెలియడంతో వెంటనే మలకన్‌గిరి అగ్నిమాపక కార్యాలయానికి సమాచారం అందించారు. అయితే సిబ్బంది అక్కడికి చేరుకున్నా.. అంతా చీకటిమయం కావడంతో గల్లంతైన వారిని వెతికేందుకు ఆటంకం ఏర్పడింది. శుక్రవారం ఉదయం 5 గంటలకు గాలింపు ప్రారంభించి, మృతదేహాలను వెలికితీశారు. మల్కన్‌గిరి పోలీసు ఐఐసీ రీగాన్ కీండో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాలను స్వాధీనం చేసుకొని, పోస్టుమార్టం నిమిత్తం మల్కన్‌గిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ..

మల్కన్‌గిరి జిల్లా కేంద్రానికి సమీపంలో గౌడిగూడ వద్ద నిర్మాణంలో ఉన్న ఎయిర్‌స్ట్రిప్ ప్రహరీ గురువారం సాయంత్రం అకస్మాతుగా కుప్పకూలింది. అక్కడే పనుల్లో ఉన్న పలువురు కార్మికులు తీవ్ర గాయాలపాలయ్యారు. చుట్టుపక్కల వారు వెంటనే మల్కన్‌గిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం ఇద్దరు మృతిచెందారు. మృతులు సమీపంలోని మీపపాలి గ్రామానికి చెందిన తిలోక్తమా బెనియా(30), మనోజ్(27)గా గుర్తించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాల కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీనిపై మలకన్‌గిరి ఐఐసీ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరుపున నష్టపరిహారం అందిస్తామని అధికారులు హామీ ఇచ్చారు.



గల్లంతైన వారి కోసం జలాశయంలో గాలిస్తున్న అగ్నిమాపక సిబ్బంది



కూలిన గోడ వద్ద స్థానికుల సహాయక చర్యలు



ఘటనా స్థలంలో బాధితులు

సముద్రంలో విద్యార్థినుల గల్లంతు..

బరంపురం: ఛత్రపూర్‌లో జరుగుతున్న అమ్మవారి సంబరాలు తిలకించేందుకు వచ్చిన ఆరుగురు విద్యార్థినులు గోపాల్‌పూర్ సమీపంలోని అర్జీపల్లి ఐఆర్‌ఈ సముద్ర తీరంలో స్నానానికి దిగారు. అలల తాకిడికి అంతా గల్లంతు కాగా.. నలుగురిని అగ్నిమాపక, ఒడ్రాఫ్ సిబ్బంది రక్షించారు. మరో ఇద్దరి మృతదేహాలు గోపాల్‌పూర్ పోర్ట్ జెట్టీ తీరానికి కొట్టుకువచ్చాయి. దీంతో ఈ ప్రాంతంలో విషాదఛాయలు అలముకున్నాయి. దీనిపై బాధిత కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఛత్రపూర్‌లో జరుగుతున్న అమ్మవారి సంబరాలకు గంజాం జిల్లా సరగడా గ్రామానికి చెందిన ఆరుగురు విద్యార్థినులు వచ్చారు. అక్కడి నుంచి అర్జిపల్లి సముద్ర తీరానికి స్నానానికి వచ్చారు. అంతా సరదాగా ఆడుకుంటున్న సమయంలో అలల ధాటికి వారంతా కొట్టుకుపోయారు. సమీపంలో ఉన్న మెరైన్, అగ్నిమాపక, ఒడ్రాఫ్ సిబ్బంది వెంటనే రంగంలోకి దిగారు. కొట్టుకుపోతున్న వారిలో నలుగురిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. మరో ఇద్దరు గల్లంతు కాగా.. సరగడా డిగ్రీ కళాశాల విద్యార్థిని ప్రజ్ఞారాణి(21)ని ఒడ్రాఫ్ బృందం ఒడ్డుకు చేర్చారు. గోపాల్‌పూర్ ఫోర్ట్ జెట్టీ రాళ్ల వద్దకు స్వప్నారాణి(20) మృతదేహం కొట్టుకు రావడంతో బయటకు తీశారు. మృతదేహాలను గోపాల్‌పూర్ ప్రభుత్వ ఆస్పత్రికి చేర్చారు. ఘటనపై మెరైన్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



గోపాల్‌పూర్ ఫోర్ట్ తీరంలో తేలియాడుతున్న ప్రజ్ఞారాణి(21) మృతదేహం



జెట్టీ వద్దకు కొట్టుకు వచ్చిన స్వప్నారాణి మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చుతున్న పోలీసులు



మృతులు ప్రజ్ఞారాణి, స్వాప్నరాణి(ఫైల్)

మారుమూల ప్రాంతాలకు మరిన్ని సేవలు

- కోట్‌పాడ్ రోడ్డు రైల్వేస్టేషన్‌లో 3 ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్‌కు ఆమోదం
- ప్రారంభించిన వాల్తేర్ డీఆర్‌ఎం, నవరంగపూర్ ఎంపీ, కోట్‌పాడ్ ఎమ్మెల్యే

జయపురం: జయపురం-జగదల్‌పూర్ మార్గంలోని బంశులి కొట్‌పాడ్ రోడ్డు రైల్వేస్టేషన్‌లో మూడు ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలుపుదల చేసేందుకు ఈస్టుకోస్టు రైల్వే అధికారులు ఆమోదం తెలిపారు. ఈ మేరకు వాల్తేరు డివిజనల్ మేనేజర్ అనూప్‌కుమార్ సత్పతి స్థానిక రైల్వేస్టేషన్ నుంచి జగదల్‌పూర్ వెళ్లేందుకు హీరాఖండ్ ఎక్స్‌ప్రెస్ రైలు సేవలను గురువారం సాయంత్రం జెండా ఊపి, ప్రారంభించారు. ఇప్పటి వరకు కిరండూల్-విశాఖపట్నం పాసింజర్ రైలు తప్ప ఏఒక్క ఎక్స్‌ప్రెస్ రైలు ఇక్కడ ఆగలేదు. ఈ నేపథ్యంలో ఇటువైపుగా రాకపోకలు సాగించే అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లను కొట్‌పాడ్ రోడ్డు స్టేషన్‌లో నిలుపుదల చేయాలని ఈప్రాంత ప్రజలు ఎంతోకాలంగా డిమాండ్ చేస్తున్నారు. కొట్‌పాడ్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పద్మినీ దియాన్, నవరంగపూర్ ఎంపీ రమేష్ చంద్ర మాఝి రైల్వేశాఖపై ఒత్తిడి తేవడంతో జూన్ 1నుంచి మూడు ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపేందుకు ఆశాఖ ఉన్నతాధికారులు అంగీకరించారు. దీనికి అనుగుణంగా డీఆర్‌ఎం, ఎంపీ, ఎమ్మెల్యే ప్రారంభోత్సవంలో పాల్గొని, మాట్లాడారు. కొట్‌పాడ్ రోడ్డు నుంచి ఇకపై మారుమూల ప్రాంతాల ప్రజలు కూడా సుదూర ప్రాంతాలకు సులభంగా ప్రయాణించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కొట్‌పాడ్ మున్సిపల్ చైర్మన్ ఎం.శంకరరావు, జిల్లా ఆదివాసీ అభివృద్ధి పరిషత్ చైర్మన్ చంద్రశేఖర మాఝి, కొరాపుట్ కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ ఈశ్వరచంద్ర పాణిగ్రహి, జయపురం మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ రథ్, బీజేడీ నేతలు పాల్గొన్నారు.



హీరాఖండ్ ఎక్స్‌ప్రెస్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న డీఆర్‌ఎం సత్పతి, ఎంపీ మాఝి, ఎమ్మెల్యే దియాన్

- జగదల్‌పూర్-భువనేశ్వర్(18448) హీరాఖండ్ ఎక్స్‌ప్రెస్ ఈనెల 1నుంచి కొట్‌పాడ్ రోడ్డుకు సాయంత్రం 5.03 గంటలకు చేరుకొని, 5.05 గంటలకు పయనమవుతుంది. తిరుగు ప్రయాణంలో భువనేశ్వర్-జగదల్‌పూర్(18447) ఈనెల 2నుంచి తెల్లవారుజాము 4.13 గంటలకు 4.15 గంటలకు బయల్దేరుతుంది.
- రౌర్కెలా-జగదల్‌పూర్(18107) ఎక్స్‌ప్రెస్ ఈనెల 2నుంచి ఉదయం 8.45 గంటలకు కొట్‌పాడ్ రోడ్డుకు చేరుకుని, 8.47గంటలకు బయల్దేరుతుంది. తిరుగు ప్రయాణంలో జగదల్‌పూర్-రౌర్కెలా(18108) ఈనెల 2నుంచి మధ్యాహ్నం 2.43 గంటలకు చేరుకొని, 2.45 గంటలకు పయనమవుతుంది.
- విశాఖపట్నం-కిరండూల్(18514) నైట్ ఎక్స్‌ప్రెస్ రైలును ఈనెల 2నుంచి తెల్లవారుజాము 4.13 గంటలకు కొట్‌పాడ్ రోడ్డుకు చేరుకొని, 4.15 గంటలకు పయనమవుతుంది. తిరుగు ప్రయాణంలో కిరండూల్-విశాఖపట్నం(17513) ఈనెల 2నుంచి రాత్రి 7గంటలకు చేరుకొని, 7.02 గంటలకు బయల్దేరుతుంది.

కిరండూల్ ఎక్స్‌ప్రెస్‌ను భువనేశ్వర్ వరకు పొడిగించండి

కొరాపుట్: కిరండూల్-విశాఖపట్నం వెళ్తున్న రాత్రిపూట ఎక్స్‌ప్రెస్ రైలును భువనేశ్వర్ వరకు పొడిగించాలని జనకల్యాణ్ మంచ్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు కొరాపుట్ జిల్లాలో పర్యటించిన రైల్వే వాల్తేర్ డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతిని కలిశారు. ఈ రైలు వేకువజాము 3గంటలకు విశాఖ చేరుకుని, తిరిగి రాత్రి 9 గంటలకు కిరండూల్ బయలు దేరుతుందన్నారు. సుమారు 18 గంటలు విశాఖలో ఖాళీగా ఉంటోందని గుర్తుచేశారు. దీనికి ప్రత్యమ్నాయంగా భువనేశ్వర్ వరకు పొడిగిస్తే రాకపోకలకు 12 గంటలు, మిగిలిన 6 గంటలు భువనేశ్వర్‌లో సర్వీస్ చేయించుకోవచ్చని అభిప్రాయం వ్యక్తంచేశారు. దీనివల్ల అటు ప్రజలు, ఇటు రైల్వే వార్గాలకు అదనపు ప్రయోజనం చేకూరుతుందని వివరించారు. దీనిపై స్పందించిన డీఆర్‌ఎం.. శాఖాపరంగా పరిశీలిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజేంద్రగౌడ, టి.గౌరీశంకర్, సీలాద్రి తదితరులు పాల్గొన్నారు.



కొట్‌పాడ్ రోడ్డు రైల్వేస్టేషన్



డీఆర్‌ఎం అనూప్ సత్పతితో మాట్లాడుతున్న జనకల్యాణ్ మంచ్ సభ్యులు

గిరిజనుడి నిజాయితీ

కాశీబుగ్గ: కాశీబుగ్గలోని బ్యాంక్ ఆఫ్ ఇండియాలో అదనంగా రూ.20 వేలు ఇచ్చిన క్యాషియర్‌కు తిరిగి నగదు అందజేసిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. కొండలోగాం గ్రామానికి చెందిన సవర ఆనందరావు ఓ జీడి పరిశ్రమ యజమాని వద్ద గుమస్తాగా పనిచేస్తున్నారు. రెండు వేల రూపాయల నోట్లు మార్చడానికి బ్యాంకుకు రాగా, రూ.20 వేల నగదుకు బదులు రూ.40 వేలను క్యాషియర్ పొరపాటున ఇచ్చేశారు. గుమస్తా పరిశ్రమకు వెళ్లి చూడగా అదనంగా వచ్చిన నగదు గుర్తించారు. అనంతరం బ్యాంకు అధికారులకు నగదు అప్పగించారు. యువకుడి నిజాయితీని బ్యాంకు సిబ్బంది అభినందించారు.

మూల్యాంకన కేంద్రం పరిశీలన

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనంలో పాల్గొంటున్న అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆర్జేడీ శారద సూచించారు. శుక్రవారం శ్రీకాకుళం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో జరుగుతున్న స్పాట్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. దిద్దుబాటు తీరు, మార్కుల కేటాయింపు, బబ్లింగ్ చేయడాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. మౌలిక సదుపాయాలను ఎగ్జామినర్లు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐఓ ఎస్.తవిటినాయుడు, జనరల్ 1, 2 బి.శ్యామ్‌సుందర్, కె.తవిటినాయుడు, ఏసీవోలు పాల్గొన్నారు.

పశు బీమా.. రైతుకు ధీమా!



గొర్రెలు, మేకల మంద

- ఒకసారి బీమా ప్రీమియం చెల్లిస్తే మూడేళ్ల కాలపరిమితి
- 21 రోజుల్లోపే పరిహారం చెల్లింపు
- సద్వినియోగం చేసుకోవాలంటున్న అధికారులు



పాడి రైతులకు అవగాహన కలిగిస్తున్న అధికారులు

ఎల్.ఎన్.పేట: జిల్లాలో గ్రామీణ ప్రాంత రైతులు వ్యవసాయం తర్వాత పాడి పరిశ్రమకే అధిక ప్రాధాన్యమిస్తారు. అయితే పశుపోషణ సవాళ్లతో కూడుకుంటుంది. ఈ నేపథ్యంలో జీవాల పెంపకందారులకు ఆర్థికంగా ప్రయోజనం చేకూరేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పాడి పరిశ్రమలో పాడి, దుక్కి పశువులు, గేదెలు, ఆవులు, గొర్రెలు, మేకలు, నాటుకోళ్లు వీటినే నమ్ముకుని జీవనం సాగిస్తున్న రైతులకు భరోసా కల్పిస్తూ ప్రభుత్వం 'వైఎస్సార్ పశుబీమా పథకాన్ని' అమల్లోకి తెచ్చింది. పలు రకాల వ్యాధులు, ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదవశాత్తు, సహజ సిద్ధంగా మృతి చెందిన వాటికి బీమా చెల్లించేందుకు ప్రభుత్వం కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకుంది.

జిల్లాలో పరిస్థితి..	
ఆవులు	4,56,291
గేదెలు	40,477
మేకలు	6,23,641
గొర్రెలు	2,77,909

ప్రీమియం చెల్లింపు ఇలా..

- తెలుపు రేషన్‌కార్డు కలిగిన నిరుపేద రైతులు తమ వాటా కింత 20 శాతం, ఇతర రైతులు (రేషన్ కార్డు లేనివారు) 50 శాతం ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది.
- దేశవాళి, సంకరజాతి పశువులకు మూడేళ్ల బీమా కాలానికి రూ.30 వేలు బీమా మొత్తం కాగా తెలుపు రేషన్ కార్డు లేని రైతు రూ.960, కార్డు ఉన్న రైతు రూ.384 చెల్లించాలి.
- నాటు జాతి పశువులు మూడేళ్ల బీమా కాలానికి రూ.15వేలు బీమా మొత్తం కాగా తెలుపు రేషన్ కార్డు లేని రైతు రూ.480, కార్డు ఉన్న రైతు రూ.192 చెల్లించాలి.
- గొర్రెలు, మేకలు, పందులకు ఏడాదికి బీమా మొత్తం రూ.6 వేలు ఉంది. తెలుపు రేషన్ కార్డు లేని రైతు రూ.90, కార్డు ఉన్న రైతు రూ.36లు, రెండేళ్ల కాల పరిమితికి తెలుపు రేషన్ కార్డు లేని రైతు రూ.135, కార్డు కార్డు ఉన్న రైతు రూ.54, మూడేళ్ల కాలపరిమితికి తెలుపు రేషన్ లేని రైతు రూ.187.50, కార్డు ఉన్న రైతు రూ.75 చెల్లించాలి.

జీవాలు మరణిస్తే..

పశువులు, జీవాలు ఏదైనా కారణంతో మరణిస్తే వెంటనే పశువైద్య శాఖ అధికారులకు తెలియజేయాలి. రైతు ముందుగా చెల్లించిన కాలపరిమితిని, చెల్లించిన బీమా ప్రీమియంను పరిగణనలోకి తీసుకుని పరిహారం చెల్లిస్తారు. ఆరు నెలలు, ఆపైబడిన వయసు కలిగిన జీవాలు (ఒక కుటుంబానికి 50 మాత్రమే) మరణిస్తే రూ.6వేలు చెల్లిస్తారు. దేశవాళీ పశువులకు రూ.30వేలు, నాటు పశువులకు రూ.15వేలు బీమా (ఒక కుటుంబానికి 5 పశువులకు) వస్తుంది. మరణించిన 21 రోజుల్లో బీమా మొత్తం రైతు బ్యాంకు ఖాతాలో జమవుతుంది. ప్రభుత్వ నిబంధనలు కాకుండా పూర్తి స్థాయిలో బీమా చెయించుకుంటే పశువులకు రూ.1.20 లక్షలు, జీవాలకు రూ.15 వేలు బీమా వర్తిస్తుంది.

అవగాహన కల్పిస్తున్నాం



వైఎస్సార్ పశుబీమా పథకం పాడి రైతులకు మేలు చేకూర్చేలా ఉంది. పశువులు, జీవాలు మరణించిన 21 రోజుల్లోనే బీమా మొత్తం రైతు బ్యాంకు ఖాతాకు జమవుతుంది. బీమా పథకంపై రైతులకు అవగాహన కలిగిస్తున్నాం. పశువులు, జీవాలు మరణిస్తే బాధిత రైతులు గ్రామ సచివాలయంలో ఉన్న వెటర్నరీ సహాయకులు, పశు వైద్య శాల డాక్టర్‌కు తెలియజేయాలి.

– ఎం.లోకనాథం, ఎ.డి. పశుసంవర్థక శాఖ, కోటబొమ్మాళి

బీమా చెల్లించా



మాకు మేకలు, గొర్రెల మంద ఉంది. బీమా చెల్లించాలని పశువుల డాక్టర్‌తో పాటు గ్రామ సచివాలయం సిబ్బంది, గోపాల మిత్రలు చెప్పారు. మేకలు, గొర్రెల మందకు బీమా చెల్లించాను. మా కోసం అధికారులు, నాయకులు ఆలోచన చేయటం గొప్ప విషయం.

– బొమ్మాళి సిమ్మన్న, గొర్రెల మంద కాపరి, కృష్ణాపురం, ఎల్.ఎన్.పేట

● జ్ఞాపకాల ఒడిలో..



శ్రీకాకుళం రూరల్ మండల పరిధిలోని సింగుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1993–94 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సింగుపురం, బైరి పరిసర ప్రాంతాలకు చెందిన పూర్వ విద్యార్థులంతా ఒకే చోటకు చేరి ఆనాటి జ్ఞాపకాలను ఒకరితో ఒకరు పంచుకున్నారు. అప్పటి గురువులకు పాదాభివందనం చేస్తూ వారిని ఘనంగా సన్మానించారు.

– శ్రీకాకుళం రూరల్

మెగా ఉద్యోగ మేళాకు విశేష స్పందన



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళంలో నిర్వహించిన మెగా ఉద్యోగ మేళాకు విశేష స్పందన లభించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శ్రీకాకుళం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి స్థానిక ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో సిల్వర్ జూబ్లీ ఆడిటోరియం వేదికగా శుక్రవారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. 15 ప్రైవేటు సంస్థలు పాల్గొనగా, 533 మంది నిరుద్యోగ యువతీ యువకులు హాజరయ్యారు. ఆయా కంపెనీ ప్రతినిధులు నిర్వహించిన లిఖిత, మౌఖికపరమైన పరీక్షలు, ఇంటర్వ్యూల్లో ప్రతిభకనబర్చిన 209 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు.

ఉపాధి కల్పనే లక్ష్యం..

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలను రూపొందించిందని డీఆర్‌డీఏ పీడీ డి.వి.విద్యాసాగర్ అన్నారు. చదువుతోపాటు నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పీటీ సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎంపిక కాని అభ్యర్థులు నిరాశ చెందవద్దన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన స్కిల్ హబ్స్ ట్రైనింగ్‌లో చేరి నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. జిల్లాలో నియోజకవర్గానికి ఒకటి చొప్పున మొత్తం 8 స్కిల్ హబ్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పదవ తరగతి, ఆపైన చదివిన వారు ఈ కోర్సుల్లో చేరి నైపుణ్యాన్ని పెంచుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధి అధికారి కె.సుధ, స్థానిక ప్రిన్సిపాల్ పి.సురేఖ, సెట్‌శ్రీ సీఈఓ బి.వి.ప్రసాదరావు, జిల్లా పర్యాటక అధికారి ఎన్.నారాయణరావు, కళాశాల నోడల్ జె.కె.సి కోఆర్డినేటర్ పైడితల్లి, బి.చంద్రమౌళి, ప్లేస్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ ఎం.వంశీకృష్ణ, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నాగుపాము హతం



గోవిందరావు హతమార్చిన నాగుపాము

సీతానగరం: మండలకేంద్రం లోని కమలా తోటకాలనీలో కోడిగుడ్ల కోసం కోళ్లగూడులో చొరబడిన నాగుపాము ఇంటి యజమాని కంటపడడంతో హతమార్చాడు. శుక్రవారం ఉదయం గ్రామానికి చెందిన వై గోవిందరావు ఇంటివద్ద కోళ్లగూడులో గుడ్ల కోసం నాగుపాము చొరబడింది. కోళ్లగూడు నుంచి శబ్దం రావడంతో పాము చొరబడుతున్నట్లు గుర్తించిన ఇంటియజమాని బయటకు పంపించడానికి ప్రయత్నం చేసినా శబ్దం చేయడంతో ఫలితం కానరాలేదు. దీంతో కర్రతో హతమార్చారు.

మూడు గొర్రెలు సజీవ దహనం

- రెండు పశువుల శాలలు దగ్ధం



అగ్నిప్రమాదంలో కాలిబూడిదైన గొర్రెలు, పశువులు శాలలు

బొండపల్లి: మండలంలోని ఒంపల్లి గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు పశువులు దగ్ధం కావడంతో పాటు మూడు గొర్రెలు సజీవ దహనమయ్యాయి. ఈ సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గొర్లె గౌరినాయుడు తన పశువులు, గొర్రెలను వేర్వేరు శాలల్లో కట్టి ఉంచగా అకస్మాత్తుగా జరిగిన అగ్రిప్రమాదంలో రెండు పశువుల శాలలు కాలిపోగా ఒకదానిలో ఉన్న మూడు గొర్రెలు పూర్తిగా, మరో మూడు పాక్షికంగా కాలిపోయాయి. అలాగే ఇదే ప్రమాదంలో శాలలో ఉంచిన సైకిల్‌తో పాటు రెండు పశువుల శాలలు పూర్తిగా కాలి బూడిదయ్యాయి.అగ్ని మాపక వాహనానికి సమాచారం ఇచ్చే లోగానే పూర్తిగా దగ్ధమయ్యాయి. ప్రమాదంలో కాలిపోయిన రెండు శాలలతో పాటు గొర్రెలకు సంబంధించి ప్రభుత్వం నష్టపరిహారం అందచేసి ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

పాము కాటుతో వ్యక్తి మృతి



మృతిచెందిన కిశోర్

పార్వతీపురం: గుమ్మలక్ష్మీపురం మండలం డొంగరి కెక్కువ గ్రామానికి చెందిన కోలక కిశోర్ పాము కాటు వేయడంతో శుక్రవారం మృతి చెందాడు. పొలానికి వెళ్లిన కిశోర్ పాము కాటుకు గురయ్యాడు. దీంతో వెంటనే కురుపాం పీహెచ్‌సీకి తీసుకువెళ్లగా ప్రాథమిక చికిత్స నిర్వహించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి 108 వాహనం ద్వారా తరలించారు. అయితే అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ..

విజయనగరం క్రైమ్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహిళ విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. స్థానిక అయ్యన్నపేట కామాక్షీనగర్ ప్రాంతంలో నివాసం ఉంటున్న నిర్మల (60) గత నెల 30వ తేదీన ఇంటి నుంచి బయటకు పెరుగు ప్యాకెట్ కొనుగోలు చేసేందుకు వచ్చింది. రామవరం నుంచి విజయనగరం వైపు వస్తున్న క్యాబ్ ఆమెను బలంగా ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆమెను కేంద్రాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌లో చేర్పించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్సై మురళి చెప్పారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

విజయనగరం క్రైమ్: స్థానిక రింగురోడ్డులో సాయి ఆలయం సమీపంలో సుమారు 30 ఏళ్ల నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన వ్యక్తి మృతిచెందినట్లు వన్‌టౌన్ పోలీసులు శుక్రవారం తెలిపారు. స్థానిక మహిళా పోలీసు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు అక్కడికి వెళ్లి అనారోగ్యంతో ఉన్న గుర్తు తెలియని వ్యక్తిని 108 వాహనంలో తరలించి కేంద్రాస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పోలీసు లు పేర్కొన్నారు. మృతదేహాన్ని కేంద్రాస్పత్రిలోని మార్చురీలో భద్రపరిచామని ఎవరైనా గుర్తిస్తే వన్‌టౌన్ పోలీసులను సంప్రదించాలని కోరారు.

రెంటికీ చెడ్డ రేవడిలా..!

- రెండు జిల్లాల నడుమ నలిగిపోతున్న రైతులు
- అధికారుల పొరపాటు.. రైతుల గ్రహపాటు
- కొండపోరంబోకుగా 194 ఎకరాల జిరాయితీ భూముల నమోదు
- దశాబ్దాలుగా అందని రుణాలు, ప్రభుత్వ పరిహారం



పెదరావుపల్లి గ్రామం ముఖచిత్రం

కొత్తవలస: శతాబ్దం క్రితం జరిగిన పొరపాటు ఆగ్రామ రైతుల పాలిట శాపంగా మారడంతో నేటికీ అవస్థలు పడుతున్నారు. వంద సంవత్సరాలుగా వరి, జీడి, మామిడి, కొబ్బరి పంటలు సాగు చేసుకుంటున్న భూములను కొండ పోరంబోకుగా రికార్డుల్లో నమోదు చేయడంతో క్రయ దస్తావేజులుండీ హక్కులు లేక ఆవేదన చెందుతున్నారు. ఆనాటి పొరపాటును సరి చేయాలని దశాబ్దాలుగా ప్రభుత్వాధికారులు, పాలకుల చుట్టూ తిరుగుతునే ఉన్నారు. అసలు ఆగ్రామం ఏ జిల్లా, ఏ మండలం పరిధిలోకి వస్తుందో తెలియక క్షేత్రస్థాయిలో అధికారులు కూడా తలలు పట్టుకుంటున్నారు. కొత్తవలస మండలంలోని కాటకాపల్లి పంచాయతీ పెదరావుపల్లి గ్రామ పరిస్థితి ఇది. పెదరావుపల్లి గ్రామం విశాఖ, విజయగనరం జిల్లాల మధ్య ఉంది.ఈ గ్రామం పరిధిలో 868.75 ఎకరాల భూమి ఉంది. స్వాతంత్ర్యం రాక ముందు 1902వ సంవత్సరంలో జరిగిన భూ సర్వేలో ఈ గ్రామ రెవెన్యూ పరిధిలోని కొంత భాగాన్ని శృంగవరపుకోట తాలుకా నుంచి భీమునిపట్నం తాలుకాకు మార్చాలనే ఉద్దేశంతో అప్పటి అధికారులు సర్వే ప్రారంభించారు. దీంతో గ్రామస్తులు తమ గ్రామాన్ని శృంగవరపుకోట తాలూకాలోనే ఉంచాలని పట్టుబట్టి అప్పటి సర్వేకు సహకరించలేదు. దీంతో అప్పట్లో సర్వే అధికారులు 674.75 ఎకరాల భూమిని శృంగవరపుకోట తాలూకాలో చూపించి, మిగిలిన పెదరావుపల్లి గ్రామాన్ని, ఆ గ్రామ రైతులు సాగు చేస్తున్న 194 ఎకరాల సాగు భూమిని భీమునిపట్నం తాలూకాలోని పద్మనాభం మండలంలో సర్వే నంబర్-1లో కొండపోరంబోకుగా నమోదు చేసేశారు.

పొరపాటును అధికారులు గుర్తించినా..

గ్రామంలో అప్పట్లో జరిగిన సర్వే తప్పిదాన్ని మళ్లీ 1965లో జరిగిన రీ సర్వేలో అధికారులు గుర్తించారు. అప్పటి నుంచి సమస్య పరిష్కరించాలని గ్రామ రైతులు అధికారులు, పాలకుల చుట్టూ తిరిగినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది.

వైఎస్సార్ జగనన్న భూ సర్వేతో కదలిక

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్సార్ జగనన్న భూ సర్వేతో ఆ గ్రామ సమస్యలో కదలిక మొదలైంది. స్థానిక ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు చొరవతో ఆ గ్రామ ఎంపీటీసీ కిలపర్తి అప్పలపరదేశినాయుడు, పెంట అప్పారావు, పెంట జగ్గునాయుడు, బాదిరెడ్డి అప్పారావు తదితరుల ఆధ్వర్యంలో గ్రామ రైతులు ప్రస్తుతం జరుగుతున్న రీసర్వేలో సమస్యను లేవనెత్తి జిల్లా మాజీ కలెక్టర్ ఎ.సూర్యకుమారి దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే ఆమె కొత్తవలస తహసీల్దార్ కార్యాలయానికి, జిల్లా సర్వే డిపార్ట్‌మెంట్‌కు లేఖలు రాసి సమగ్ర సర్వే నిర్వహించి నివేదికలను అందించాలని కోరారు. ఈ మేరకు నిర్వహించిన సర్వేలో పెదరావుపల్లి గ్రామంలో రైతులు సాగుచేస్తున్న భూములు మొత్తంగా 194 ఎకరాలుగా అధికారులు గుర్తించారు. ప్రస్తుతం ఈ భూమి విశాఖ జిల్లా, పద్మనాభం మండలం, కొవ్వాడ గ్రామం సర్వే నంబర్-1లో కొండపోరంబోకు భూములుగా నమోదైనట్లు ధ్రువీకరించారు. ఈ భూములను విజయనగరం జిల్లా కొత్తవలస మండలం పెదరావుపల్లి గ్రామంలోకి చేర్చాలని ప్రధాన భూ పరిపాలన కమిషనర్‌కు గత కలెక్టర్ ఎం.సూర్యకుమారి రేఖా నంబర్ 876/2022-ఎ1తో గత సెప్టెంబర్-11న పంపించారు.ఈ నివేదికల ఆధారంగా సత్వరం న్యాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. వాస్తవంగా పెదరావుపల్లి గ్రామానికి సంక్షేమ,అభివృద్ధి పనులకు నిధులు విజయనగరం జిల్లా కొత్తవలస మండలం నుంచే అదుతున్నాయి.విశాఖ జిల్లా పద్మనాభం మండలానికి పెదరావుపల్లి గ్రామానికి ఎటువంటి సంబంధం లేదు. ఈ గ్రామం పరిధిలో సంభవించే క్రిమినల్, సివిల్ కేసులు ఎక్కడ నమోదు చేయాలో తెలియక పోలీసులు తలలు పట్టుకుంటున్నారు. తమకు దశాబ్దాల పాటు రుణాలు గాని, ప్రభుత్వం నుంచి వచ్చే పరిహారాలు కూడా అందడం లేదని వాపోతున్నారు.

పూర్తిస్థాయిలో సహకరిస్తాం



పెదరావుపల్లి గ్రామం భూములకు సంబంధించి రైతులకు జరిగిన అన్యాయాన్ని గుర్తించాం.ఇప్పటికే రైతుల అభ్యర్థన, కలెక్టర్ ఆదేశాల మేరకు సర్వే నిర్వహించాం. సుమారు 8 ఎకరాల్లో గ్రామకంఠం, 184 ఎకరాల సాగు భూమి ఉన్నట్లు గుర్తించాం. ఈ భూములు ప్రస్తుతం విశాఖ జిల్లా పద్మనాభం మండలం, కొవ్వాడ రెవెన్యూపరిధిలోని సర్వే నంబర్-1లో కొండపోరంబోకు భూములుగా ఉన్నట్లు గుర్తించాం. ఈ నివేదికను కలెక్టర్‌కు అందజేశాం.

– జి.హేమంత్‌కుమార్, తహసీల్దార్, కొత్తవలస మండలం

కుమిలిలో మైనింగ్ ప్రాంతం పరిశీలన

- రెవెన్యూ భూములే అంటున్న ఆ శాఖ అధికారులు
- సర్వే చేసి నిర్ధారించాలంటున్న అటవీశాఖ అధికారులు



కుమిలిలో మైనింగ్ జరుగుతున్న ప్రాంతం మ్యాప్ పరిశీలిస్తున్న రెవెన్యూ, అటవీ, మైనింగ్ అధికారులు

పూసపాటిరేగ: మండలంలోని కుమిలి కొండ సర్వే నంబర్1లో మైనింగ్ జరుగుతున్న ప్రాంతాన్ని రెవెన్యూ, అటవీ, మైనింగ్‌శాఖల అధికారులు సంయుక్తంగా శుక్రవారం పరిశీలించారు. గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్న ప్రాంతాన్ని ఫారెస్ట్ రేంజర్ పి.అప్పలరాజు, సర్వే ఇన్‌స్పెక్టర్ జ్ఞానేశ్వరరావు, తహసీల్దార్ ఇ.భాస్కరరావు, సెటిల్‌మెంట్ అధికారి కె.వెంకటరమణ, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ శ్యాం పీటర్‌ల బృందం పరిశీలించి క్వారీయింగ్ జరిగిన ప్రాంతాన్ని పూర్తిస్థాయిలో తనిఖీ చేశారు. కుమిలి కొండ సర్వే నంబర్ 1లో 428.70 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉంది. దానిలో కొంత మేర నిబంధనల మేరకు మైనింగ్‌కు ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చాయి, సిరుగుడు గోవిందరావు పేరిట 2.5 హెక్టార్లు, దల్లి గౌతమరెడ్డి పేరిట 7 హెక్టార్లకు మైనింగ్‌కు అనుమతులు ఇచ్చారు. వాటిలో ఫారెస్టు అధికారులు ఫారెస్టుశాఖకు చెందిన భూములలో కొంత మేర తవ్వకాలు జరుగుతున్నట్లు ఆరోపణలు చేశారు. దీనిపై పూసపాటిరేగ తహసీల్దార్ ఇ.భాస్కరరావు స్పందిస్తూ మైనింగ్ జరుగుతున్న భూములు అనుమతులు వున్న రెవిన్యూశాఖకు సంబంధించినవేనని, ఫారెస్టు అధికారులు ఎటువంటి ఆధారాలు లేకుండా ఆరోపిస్తున్నారన్నారు. గెజిట్‌లో ఫారెస్టు భూములుగా ఉన్నాయని అని, రికార్డుల్లో రెవెన్యూ భూములుగా ఉన్నాయని అధికారులు తెలియజేశారు. సర్వే పూర్తయితే ఫారెస్టు, రెవెన్యూశాఖలకు సంబంధించిన భూములకు క్లారిటీ వచ్చే అవకాశం ఉందని అభిప్రాయ పడ్డారు. ఈ పరిశీలనలో మండల సర్వేయర్ గణపతిరావు, అటవీశాఖ బీట్ అధికారి సమత తదితరులు ఉన్నారు.

సమష్టి కృషితో ఉత్తమ ఫలితాలు సాధించాలి

- కలెక్టర్ నిషాంత్ కుమార్



కలెక్టర్ నిషాంత్‌కుమార్‌ను సత్కరించిన జిల్లా అధికారులు

పార్వతీపురంటౌన్: సమష్టి కృషితో అన్ని రంగాల్లో పార్వతీపురం మన్యం జిల్లా ఉత్తమ ఫలితాలు సాధించాలని కలెక్టర్ నిషాంత్ కుమార్ పిలుపునిచ్చారు. జాతీయస్థాయిలో జిల్లా అవార్డులు సాధించినందుకుగాను గురువారం రాత్రి స్థానిక రాయల్ కన్వెన్షన్ సెంటర్‌లో కలెక్టర్‌ను జిల్లా అధికారుల సంఘం సన్మానించింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటైన జిల్లాలో కనీస వసతులతో ప్రస్థానం ప్రారంభించి, సంవత్సర కాలంలో జాతీయ స్థాయిలో నాలుగు అవార్డులు సాధించామన్నారు. భవిష్యత్‌లో కూడా ఇదే స్ఫూర్తితో పనిచేసి జిల్లాను అభివృద్ధి బాటలో కొనసాగించాలని కోరారు.

జిల్లాలో మంచి టీమ్ ఉంది

జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు మాట్లాడుతూ కలెక్టర్‌తో కలిసి పనిచేసిన అనుభవం ఉందని, ఏదైనా పని పూర్తి చేయడానికి ఆయన రూపొందించే ప్రణాళికలే కీలకమని, సమస్యలను లోతుగా అధ్యయనం చేసి పరిష్కారం కనుగొంటారని కొనియాడారు. ఎస్పీ విక్రాంత్ పటేల్ మాట్లాడుతూ కలెక్టర్ జిల్లాలో మంచి టీమ్ ఏర్పాటు చేశారని, కొత్తగా ఏర్పడిన, మారుమూల జిల్లాలో ఇటువంటి బృందంతో కలిసి ప్రజలకు సేవ చేసేఅవకాశం వచ్చినందుకు తనకు సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సి.విష్ణు చరణ్, పాలకొండ సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, అదనపు ఎస్పీ ఒ.దిలీప్ కుమార్, డీఎఫ్‌ఓ ప్రసన్న ప్రసంగిస్తూ జిల్లా అభివృద్ధికి కలెక్టర్ నాయకత్వం, ఆయన అందించిన సూచనలు, సలహాలు, సమస్యలపై ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కరించడం వల్ల సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ కె.హేమలత, సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ దేవుళ్ల నాయక్, జిల్లా పౌరసరఫరాల అధికారి మూర్తి, జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి, డా.ఎంవీఆర్ కృష్ణాజీ, డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథరావు, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ పి. కిరణ్ కుమార్, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ, జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.ప్రేమ్ కుమార్, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి కె. విజయగౌరి, జిల్లా ప్రణాళిక అధికారి పి.వీరరాజు, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి ఎం.డి.గయాజుద్దీన్ ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గ్రూప్-సి ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం రూరల్: స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ఆధ్వర్యంలో గ్రూప్-సి ఉద్యోగాలైన లోయర్ డివిజన్ క్లర్క్, జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్స్ ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ జారీ అయిందని జిల్లా ఉపాధి కల్పనాధికారిణి డి.అరుణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఎస్ఎస్‌సీ.ఎన్ఐసి.ఐఎన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 8 చివరి తేదీ అని తెలిపారు. ఈ నెల 10 లోగా ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 10 కేంద్రాల్లో ఆగస్టు నెలలో పరీక్ష జరుగుతుందని నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముగ్గురు మహిళల అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): ప్రయాణికుల ముసుగులో చోరీలకు పాల్పడిన ఘటనలో ముగ్గురు మహిళలను నెల్లూరు చిన్నబజారు పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ ఎ.సురేంద్రబాబు కేసు వివరాలు వెల్లడించారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తికి చెందిన ఎ.లక్ష్మి ఈనెల 14వ తేదీన నెల్లూరుకు వచ్చారు. రాత్రి 8.30 గంటల సమయంలో ఆమె గాంధీబొమ్మ నుంచి ఆర్టీసీ బస్టాండ్‌కు ఆటోలో ప్రయాణిస్తున్నారు. ముగ్గురు గుర్తుతెలియని మహిళలు అదే ఆటోలో ఎక్కారు. లక్ష్మికి చెందిన హ్యాండ్ బ్యాగ్ తెరిచి రూ.3.80 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలను అపహరించుకెళ్లారు. బస్టాండ్ వద్ద ఆటో దిగిన లక్ష్మికి బ్యాగ్‌లోని నగలు కనిపించకపోవడంతో చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ నేతృత్వంలో ఎస్సై ఎ.సైదులు తన సిబ్బందితో కలిసి కేసు దర్యాప్తును ప్రారంభించారు. బాధితురాలు చెప్పిన ఆనవాళ్లు, సాంకేతికత ఆధారంగా నిందితురాళ్లు విజయనగరం జిల్లా కొత్తవలసకు చెందిన ఎం.సంధ్య, భాను, అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలం, గొట్లం గ్రామానికి చెందిన ఆర్.వసంతగా గుర్తించారు. వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం వీఆర్ లా కళాశాల ఎదురుగా ఉన్న రహదారిపై అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నేరం అంగీకరించడంతో వారిని అరెస్ట్ చేసి రూ.3.80 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.

ఖేలో ఇండియా యూనివర్సిటీ క్రీడల్లో మరో పతకం



కాంస్య పతకం చూపిస్తున్న వెయిట్ లిఫ్టర్ మణికంఠ

నెల్లిమర్ల రూరల్/విజయనగరం టౌన్: ఉత్తరప్రదేశ్‌లోని నోయిడా వేదికగా జరుగుతున్న జాతీయ స్థాయి ఖేలో ఇండియా యూనివర్సిటీ క్రీడల్లో జిల్లాకు మరో పతకం లభించింది. నెల్లిమర్ల మండలంలోని చంద్రంపేట గ్రామానికి చెందిన వెయిట్ లిఫ్టర్ మొయిద మణికంఠ కాంస్య పతకం సాధించాడు. 89 కేజీల విభాగంలో శుక్రవారం జరిగిన పోటీల్లో పాల్గొన్న మణికంఠ స్నాచ్ 130 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్ 154 కిలోల చొప్పున బరువు ఎత్తి పతకం సాధించాడు. మణికంఠకు జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోషియేషన్ ప్రతినిధులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు. విజయనగరంలోని సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో చదువుతున్న మణికంఠను కళాశాల కార్యదర్శి, కరస్పాండెంట్ డాక్టర్ ఝాన్సీలక్ష్మి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ సాయిదేవమణి, ఫిజికల్ డైరెక్టర్ మహేష్ తదితరులు అభినందించారు.

సంగీత కళాశాల ప్రిన్సిపాల్‌గా శాస్త్రి



కేవీఎల్ఎస్.శాస్త్రి, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్

విజయనగరం టౌన్: మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా కేవీఎల్ఎస్. శాస్త్రి బాధ్యతలు చేపట్టనున్నారు. కళాశాలలో వీణ లెక్చరర్‌గా పని చేస్తున్న ఆయన ప్రిన్సిపాల్‌గా అదనపు బాధ్యతలు నిర్వహించనున్నారు. ఇప్పటివరకూ ఇన్‌చార్జ్ బాధ్యతలు నిర్వహించిన డాక్టర్ మండపాక నాగలక్ష్మికి రాజమహేంద్రవరంలోని విజయశంకర ప్రభుత్వ సంగీత కళాశాల రెగ్యులర్ ప్రిన్సిపల్‌గా పదోన్నతి లభించింది.

సీఎం సహాయ నిధి.. పేదల పాలిట పెన్నిధి

- ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్ బాబు
- బాధితులకు చెక్కుల పంపిణీ



కొండవెలగాడకు చెందిన బాధిత కుటుంబానికి రూ.2లక్షల చెక్కును అందిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్ బాబు



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

నెల్లిమర్ల రూరల్: సీఎం సహాయ నిధి ఆపదకాలంలో పేదల పాలిట పెన్నిధిలా నిలుస్తోందని ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్ బాబు అన్నారు. ఈ మేరకు మండలంలోని మొయిద గ్రామంలో ఆయన స్వగృహంలో పలువురు బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను శుక్రవారం పంపిణీ చేశారు. కెల్ల గ్రామానికి చెందిన పాపయ్యమ్మకు రూ.95వేలు, కొండవెలగాడ గ్రామానికి చెందిన బూటి సూరిబాబుకు రూ.2లక్షలు, మొయిద గ్రామానికి చెందిన శిసగం ధమయంతికి రూ.లక్ష చొప్పున మంజూరు కాగా ఆ చెక్కులను బాధితుల కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతం ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబు మాట్లాడుతూ పేదరికంతో బాధపడుతూ తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్న వారికి సీఎం సహాయ నిధి కొండంత అండగా నిలుస్తోందన్నారు. ప్రజా సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. అనంతరం చెక్కులు అందుకున్న బాధితులు ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్సను ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాశినాయుడు, డీసీసీబీ వైస్‌చైర్మన్ చనమల్లు వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీ సూర్యనారాయణరాజు, నాయకులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి సీఎం సహాయనిధి

వీరఘట్టం: పాలకొండ మండలం తంపటాపల్లి గ్రామానికి చెందిన అల్లు ఈశ్వరమ్మ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. దీంతో ఆమె కుటుంబం పెద్ద దిక్కు కోల్పోయి రోడ్డున పడింది.ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి హామీ ఇచ్చారు. ఈ కుటుంబ పరిస్థితిని ఆమె ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంతో సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ.2.80 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది.ఈ చెక్కును ఎమ్మెల్యే కళావతి వండవ క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు చందక జగదీశ్వరరావు ఉన్నారు.

చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలకు స్పందన



విద్యార్థులకు నిర్వహించిన పోటీలను తిలకిస్తున్న పర్యావరణ ఇంజినీర్ టి.సుదర్శనం తదితరులు

విజయనగరం రూరల్: ఈ నెల 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలకు విశేష స్పందన లభించింది. జిల్లా కేంద్రంలోని గురజాడ గ్రంథాలయం ప్రాంగణంలో ఐదో తరగతి నుంచి ఏడో తరగతి విద్యార్థులకు ఒక విభాగం, 8 నుంచి 10 తరగతి విద్యార్థులకు మరో విభాగంగా పోటీలు నిర్వహించారు. సుమారు 250 మంది విద్యార్థులు కాలుష్య నియంత్రణ, ప్లాస్టిక్ కాలుష్యం అంశాలపై నిర్వహించిన చిత్రలేఖనం, వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చూపారు. రెండు విభాగాల్లో గెలుపొందిన విద్యార్థులకు జిల్లా పరిషత్ కార్యాలయంలో ఈ నెల 5 నిర్వహించే కార్యక్రమంలో కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందజేస్తామని పర్యావరణ ఇంజినీర్ టి.సుదర్శనం తెలిపారు.

హరిపురం విద్యార్థినికి బంగారు పతకం



గవర్నర్ చేతుల మీదుగా పతకాన్ని అందుకుంటున్న రుచిత

మందస: మండలంలోని హరిపురం గ్రామానికి చెందిన అడ్నాల రుచిత ఇంజినీరింగ్‌లో మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్ర గవర్నర్ జస్టిస్‌సయ్యద్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా ఇటీవల బంగారు పతకం అందుకుంది. సామాన్య కుటుంబానికి చెంది అడ్నాల దామోదరం, భారతిల కుమార్తె రుచిత జేఎన్‌టీయూ(కాకినాడ)లో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్(ఈఈఈ) విభాగంలో గరిష్టమార్కులు(సీజీపీ 8.66) సాధించింది. యూనివర్సిటీ స్నాతకోత్సవంలో భాగంగా గవర్నర్ చేతుల మీదుగా బంగారు పతకం అందుకుంది.

రుచిత 10వ తరగతిలో 10పాయింట్లు సాధించగా, ఇంటర్‌మీడియట్‌లో 989/1000 మార్కులు పొందింది. ఏపీ ఎంసెట్‌లో 1137వ ర్యాంకు సాధించి జేఎన్‌టీయులో చదువుతోంది. కాగా, రుచిత ప్రస్తుతం ఎల్‌అండ్‌టీలో ఎలక్ట్రికల్ ఇంజనీర్(తమిళనాడు)గా ఎంపికయ్యారు. భవిష్యత్‌లో సివిల్స్ సాధించడమే లక్ష్యమని రుచిత తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వస్త్రవ్యాపారి దుర్మరణం



ఘటనా స్థలం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు



శాంతారావు (ఫైల్)

ఆమదాలవలస : పట్టణంలోని రైల్వేస్టేషన్ జంక్షన్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో స్థానిక లక్ష్మీనగర్ వీధికి చెందిన శాంతామణి టెక్స్‌టైల్స్ వ్యాపారి అమనాన శాంతారావు(72) మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంటికి కూరగాయలు తీసుకువస్తానని సైకిల్‌పై బయల్దేరి వెళ్లిన శాంతారావును కొత్తూరు నుంచి శ్రీకాకుళం వెళ్తున్న బస్సు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందారు. డ్రైవర్ తప్పిదం వల్ల ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. ఓవైపు ఫుట్‌పాత్‌పై వ్యాపారాలు జరుగుతుండటం, అక్కడికి వచ్చిన వాహనదారులు రోడ్డుపైనే వాహనాలు పార్కింగ్ చేసి ఉండటం, డ్రైవర్ ఒక్కసారిగా కుడివైపున బస్సును నడిపించడంతో శాంతారావు బస్సు వెనుక చక్రం కింద పడి తల నుజ్జునుజ్జయ్యింది. మృతుడికి భార్య జయభారతి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ముగ్గురికీ వివాహాలయ్యాయి. ఆమదాలవలస ఎస్ఐ వై.కృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. శాంతారావుకు ఆమదాలవలస నియోజకవర్గంలో మంచి వ్యాపారిగా పేరు ఉంది. ఈయన మృతి పట్ల ఆమదాలవలస క్లాత్ అండ్ రెడీమేడ్ వస్త్ర వ్యాపారుల సంఘం నాయకులు జె.కె. వెంకటేశ్వరరావు, కె.శ్యాంప్రసాద్ తదితరులు సంతాపం తెలిపారు.

రోడ్డుపైన వ్యాపారాల వల్లే..

ఇరుకైన రహదారిలో రోలింగ్ నిర్మాణం, ఫుట్‌పాత్ వ్యాపారులు రహదారిపైకి వచ్చి వ్యాపారం చేయడం వంటి కారణాల వల్ల ఈ ప్రాంతంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.పోలీసులు, మున్సిపల్ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

వివాహిత ఆత్మహత్య



పోలా భాను మృతదేహం

కాశీబుగ్గ: పలాస -కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని గాంధీనగర్‌లో వివాహిత పోలా భాను(28) ఆత్మహత్యకు పాల్పడింది. శుక్రవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుంది. మృతురాలి భర్త స్థానికంగా పెయింటింగ్ పనులు చేస్తున్నారు. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవని, శుక్రవారం ఉదయం సైతం గొడవ పడ్డారని స్థానికులు చెబుతున్నారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ నాగిరెడ్డి, సీఐ శ్రీనివాస్ ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించారు. కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ మద్యం విక్రయిస్తే రూ.2 లక్షల జరిమానా

సారవకోట: అక్రమంగా మద్యం నిల్వలున్నా, విక్రయించినా రూ.2 లక్షలు జరిమానా విధిస్తానని సారవకోట తహశీల్దార్ ప్రవల్లికా ప్రియ హెచ్చరించారు. శుక్రవారం పాతపట్నం సెబ్ అధికారులు మండలానికి చెందిన 8 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒకసారి బైండోవర్ కేసు నమోదై మళ్లీ అక్రమంగా మద్యం విక్రయిస్తే రూ.2 లక్షలు జరిమానా విధిస్తానని స్పష్టం చేశారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

నరసన్నపేట: మండలంలోని ఉర్లాం రైల్వే స్టేషన్ సమీపంలో శుక్రవారం ఉదయం గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం గుర్తించామని రైల్వే హెచ్‌సీ ఎస్.మధుసూదనరావు తెలిపారు. 65 ఏళ్ల వయసు ఉండవచ్చని, తెల్లటి పంచె ధరించాడని, చామన ఛాయలో ఆరు అడుగుల పొడవు ఉంటాడని పేర్కొన్నారు. గుర్తు తెలియని రైలు ఢీకొనగా మృతి చెందినట్లు భావిస్తున్నామని పేర్కొన్నారు. వివరాలు తెలిసిన వారు ఆమదాలవలస రైల్వే పోలీసులను సంప్రదించాలని సూచించారు.

వివాహిత అదృశ్యం

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని కృష్ణాపార్కు వద్ద వివాహిత అదృశ్యమైనట్లు శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ వి.సందీప్‌కుమార్ తెలిపారు. ఎచ్చెర్ల మండలం ఎస్ఎస్ఆర్‌పురానికి చెందిన యువకునితో లావేరు మండలానికి చెందిన యువతితో పదిహేను రోజుల క్రితం వివాహం జరిగింది. భర్త వ్యవసాయం చేస్తుండేవాడు. గత నెల 31న (మూడురోజుల క్రితం) నవదంపతులు దుస్తులను డ్రైవాష్ చేయించేందుకు కృష్ణాపార్కు సమీపంలో షాప్ వద్దకు వచ్చారు. అక్కడే ఆమె అదృశ్యమైనట్లు భర్త శుక్రవారం రాత్రి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.